ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 3 మార్చి 2025





రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహరీ
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6: 31	5:13
నంద్యాల	6: 28	5:12



కంది రైతు కన్నీరు



ఈ రైతు పేరు వెంకటేశ్వరరెడ్డి. డోన్ మండలం రామదుర్గం నివాసి. డోన్ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రానికి 15 సంచుల్లో కందులను అమ్మకానికి తీసుకువచ్చాడు. ఆటో ఖర్చులతోపాటు, హమాలీలకు ఒక సంచికి రూ.300 చొప్పున చెల్లించాడు. ఇంత వ్యయ ప్రయాసలకోర్చి కందులు తీసుకొచ్చాడు. అయితే.. కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు కందులు నాణ్యంగా లేవన్నారు. మరోదారి లేక రైతు కందులు వెనక్కి తీసుకువచ్చి శుభ్రం చేసి కొనుగోలు కేంద్రానికి అప్పగించాడు. దీని వల్ల రైతుకు రెట్టింపు ఖర్చు అయింది. మార్క్‌ఫెడ్ అధికారులు మద్దతు ధర చెల్లించినా రవాణా ఖర్చులు పెరిగిపోయి కనీసం గిట్టుబాటు కాలేదని రైతు వెంకటేశ్వరరెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలకు కందులు అమ్మడానికి తీసుకెళ్తున్న వందలాది మంది రైతుల దుస్థితి ఇది.



డోన్ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ కేంద్రానికి రైతులు తెచ్చిన కందులు

- పంట దిగుబడి నాణ్యంగా లేదని వెనక్కి పంపుతున్న సీడబ్ల్యూసీ అధికారులు
- దళారులే నయమంటున్న రైతులు
- మార్కెట్ యార్డులో అమ్ముకుంటున్న వైనం

3లక్షల ఎకరాల్లో కంది పంట సాగు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందులకు మద్దతు ధర రూ.6వేల నుంచి రూ.7వేలు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం క్వింటం ధర రూ.7,550 నిర్ణయించింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల కంది పంట ఖరీఫ్‌లో పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం నాలుగు క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. కనీసం ఈ మాత్రం పంట దిగుబడినైనా మార్క్‌ఫెడ్ సంస్థకు విక్రయించి మద్దతు ధర పొందాలని ఉమ్మడి జిల్లా రైతులు ఆశించారు. అయితే మార్క్‌ఫెడ్ అధికారులు రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నా గోదాముల్లో వాటిని నిల్వ చేసేందుకు సీడబ్ల్యూసీ అధికారులు కొర్రీల మీద కొర్రీలు వేస్తూ రైతులను వెనక్కి పంపిస్తున్నారు. దీంతో వాళ్లకు దిక్కుతోచడం లేదు. రైతుల బాధ చూడలేకపోతున్నామని మార్క్‌ఫెడ్ అధికారులు, డీసీఎంఎస్ కేంద్రాల సిబ్బంది అంటున్నారు. కందులను కొనుగోలు చేసినా గోదాముల్లో నిల్వ చేసేందుకు సెంట్రల్ వేర్ హౌస్ అధికారులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో రైతులు తిరిగి కందులను వెనక్కి తీసుకపోతున్నారు. రైతులకు ఇది ఆర్థికంగా మరింత భారమవుతున్నది. శ్రమ అవుతున్నది. అందుకని చాలా మంది రైతులు మరోదారి లేక కర్నూలు మార్కెట్ యార్డులో తక్కువ ధరకే దళారులకు పంట దిగుబడి పెడుతున్నారు. సీడబ్ల్యూసీ అధికారులు నాణ్యత నిబంధనలు చూపుతూ తమకు అన్యాయం చేస్తుండటంతో తమకు దళారులే దిక్కు అవుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలు యార్డుకు విక్రయానికి తెచ్చిన కందులు

ఖరీఫ్‌లో రైతులు పండించిన కందులను చివరి గింజ దాకా మద్దతు ధర రూ.7,550 కొంటామని కేంద్ర సంస్థ నాఫెడ్‌తో పాటు రాష్ట్ర సంస్థ మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం 4 క్వింటాళ్లు మాత్రమే చేతికందడంతో రైతులు నష్టానికి గురయ్యారు. మార్క్‌ఫెడ్ అధికారుల హామీతో దిగుబడి తగ్గినా మద్దతు ధర అయినా అందుతుందనే ఆశతో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు వ్యయప్రయాసల కోర్చి డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలకు కందులు తీసుకొచ్చారు. మొదట్లో మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కర్నూలు జిల్లాలో 56వేల టన్నులు, నంద్యాల జిల్లాలో 44వేల టన్నులు కొంటామని మూడు నెలలకిందటే అధికారులు ప్రకటించారు. ఇప్పటికీ ఇదిగో.. అదిగో అంటూ ఫిబ్రవరిలో రైతుల నుంచి కందులు కొనడానికి డీసీఎంస్ ద్వారా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగతా 7వ పేజీలో

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులద్వారా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సోమవారం ఉదయం 9.30గంటలకు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రంజాన్ మాసం ప్రారంభం



తరావీ నమాజులో పాల్గొన్న ముస్లింలు

నంద్యాల కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నెలవంక దర్శనంతో ఆదివారం నమాజులు ప్రారంభమయ్యాయి. పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిన మాసం రంజాన్ శనివారం సాయంత్రం రంజాన్ నెల నెలవంక దర్శనం ఇవ్వడంతో ఆదివారం నుంచి రంజా న్ నెల ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయని ఆవాజ్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌సమద్, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు అంజద్‌బాషా సిద్దిఖీ తెలిపారు. పశ్చిమాన నెలవంక దర్శించ డంతో ముస్లింలు రంజాన్ నెలకు ఆధ్యాత్మిక స్వాగతం పలికినట్లయింది. నంద్యాలలోని 70కి పైగా మసీదులలో రంజాన్ నెలవంక దర్శనం ఇచ్చినట్లు మైకులలో తెలిపారు. రాత్రికి సహేరీ ఇషా నమాజు తరువాత తరావీ నమాజులకు ప్రతి ఒక్క ముస్లిం హాజరవ్వ వలసిందిగా మసీదుల లోని మైకులలో మత పెద్దలు తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి రంజాన్ మాసం ఉపవాసాలను (సహేరి) ఉపవాసాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధి జమన్, అబులైస్, అంజుమన్ సంస్థ గౌరవ అధ్యక్షులు నశ్యం మహ్మద్ ఖుద్దూస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జయహో గురు రాఘవేంద్రా

- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- బంగారు కవచంతో సుందరీకరణ
- భక్తులతో మార్మోగిన మంత్రాలయం

7

మూడు రోజులుగా మృత్యువుతో పోరాడి...

- చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శ్రీలేఖ
- కన్నీరుమున్నీరైన విద్యార్థిని తల్లిదండ్రులు
- రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం



శ్రీలేఖ(ఫైల్)



రోదిస్తున్న తల్లిదండ్రులు దస్తగిరి, శిరీషా

కర్నూలు హాస్పిటల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): **'ఎక్కడున్నావమ్మా.. ఇంటికెళ్లాం లేవమ్మా శ్రీలేఖ.. నా పెద్ద కూతురా.. బాగుంది.. బాగుంది అన్నారే డాక్టర్లు.. మరీ ఏమైంది.. శనివారం ఉదయం బాగానే మాట్లాడావే.. ఎక్కడికి పోయినావే నా బిడ్డ ఇక లేవమ్మా... ఇక నిన్ను వదిలి సుగ్గికి వెళ్లనమ్మా.. లేవమ్మా.. మన ఊరికి పోదామంటూ' మృతి చెందిన బాలిక శ్రీలేఖ మృతదేహం మీద పడి తల్లి కన్నీరు మున్నీరై విలపించింది.**

సి.బెళగల్ మండలం పోలకల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖ (14) ఆదివారం మృతి చెందింది. పాఠశాలలో సైన్స్‌డే నిర్వహిస్తుండగా శుక్రవారం చెట్టువిరిగి పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆర్ఐసీయూలో చికిత్స అందిస్తుండగా ఆదివారం కార్డియాక్ అరెస్టు కావడంతో మృతి చెందింది.

కోలుకుందని అనుకున్న తరుణంలో..

విద్యార్థిని కోలుకోవడంతో క్యాజువాల్టీ నుంచి ఆర్ఐసీయూకు పంపించి చికిత్స అందించారు. శనివారం ఉదయం కలెక్టర్ రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి విద్యార్థిని పరామర్శించారు. అయితే తెల్లవారుజామున విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఉదయం కార్డియాక్ అరెస్టుతో మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతి చెందిన బాలిక ఊరు గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామం. తల్లిదండ్రులు పోగుల దస్తగిరి, శిరీష దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి శ్రీలేఖ పోలకల్‌తో చదువుతోంది. కుమారుడు సాయికృష్ణ పాణ్యంలో చదువుకుంటున్నాడు. చిన్న కూతురు ధరణి పెద్దనేలటూరులో నానమ్మ వద్ద చదువుకుంటోంది. శ్రీలేఖ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. తరుచూ హైదరాబాదు, గుంటూరుకు వలస వెళ్తుంటారు. పిల్లలను అమ్మమ్మ, నానమ్మల దగ్గర ఉంచి సుగ్గికి వెళ్తుంటారు. పెద్దమ్మాయి శ్రీలేఖకు కూడా అమ్మమ్మ దస్తగిరమ్మ దగ్గర పోలకల్‌లో వదిలి వెళ్లారు.



పాడె మోస్తున్న డీఈవో శ్యామ్యూల్‌పాల్

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

శ్రీలేఖ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని కలెక్టర్ రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మార్చురీ వద్దకు చేరుకున్న డీఈవో శ్యామ్యూల్‌పాల్ బాలిక తల్లిదండ్రులుకు ధైర్యం చెప్పారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇద్దరు పిల్లలకు గురుకుల పాఠశాలలో చదువు కొనసాగించేలా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

విద్యార్థిని పాడె మోసిన డీఈవో

శ్రీలేఖ తుది శ్వాస వదలడంతో డీఈవో ఎస్.శ్యామ్యూల్‌పాల్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం పోస్టుమార్టం గది వద్దకు చేరుకొని బాలిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అనంతరం బాలిక స్వగ్రామమైన గోనెగండ్ల మండలం పెద్దనేలటూరుకు వెళ్లిన డీఈవో అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

క్లస్టర్ కష్టాలు



నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): **ఉపాధ్యాయులు 'క్లస్టర్' కష్టాలు ఎదుర్కొంటున్నారు. సమావేశాలు నిర్వహించే పాఠశాలలు ఎక్కడో దూరంగా ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ విద్యాబోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేసేందుకు క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహిస్తోంది. ఇవి ఎంతో ప్రయోజనకరమైనప్పటికీ సమావేశాలు నిర్వహించేందుకు గుర్తించిన క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలలు కొన్ని ఇబ్బందికరంగా మారాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా మూడో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్లస్టర్ సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నంద్యాల జిల్లాలో 1399 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను అధికారులు గుర్తించిన 107 కాంప్లెక్స్ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.**

- సెలవు ఇవ్వకుండానే వృత్తి నైపుణ్య శిక్షణ
- రాకపోకలకు ఉపాధ్యాయుల అవస్థలు

ఉపాధ్యాయుల అవస్థలివీ...

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశం జరిగే పాఠశాలకు వెళ్లడానికి సకాలంలో బస్సు సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం 11.45 గంటలకు పాఠశాల ముగించాలని, ఆ తర్వాత 12 గంటలకు విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే వరకు పాఠశాలల్లోనే ఉండాలని, ఎట్టిపరిస్థితుల్లో ఒంటి గంటకు క్లస్టర్ పాఠశాలకు చేరుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనడంతో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా అనేక గ్రామాల్లో ప్రజలు ఉదయం పిల్లలను స్కూలులో వదిలేసి సాయంత్రం వరకు పనులకు వెళ్తుంటారు. భోజనం తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు విద్యార్థులకు సెలవు ప్రకటిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. సమావేశం అనంతరం మారుమూల కేంద్రాల్లో ఉన్న క్లస్టర్‌ల నుంచి ఉపాధ్యాయులు నివాసాలకు చేరుకోవాలంటే సమస్యగా మారింది.

1 పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోరుకల్లు పాఠశాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం.

2. పాణ్యం మండలం కొణిదేడు పాఠశాల ఉపాధ్యాయులకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మద్దూరు పాఠశాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం.

3. ఆత్మకూరు మండలం వెంకటాపురం పాఠశాల ఉపాధ్యాయులకు 26 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు పట్టణంలోని ఉర్దూ పాఠశాలను ఎంపిక చేయడం

4. గడివేముల మండలం కరిమద్దెల పాఠశాల ఉపాధ్యాయులకు బస్సు సౌకర్యం లేని 17 కిలోమీటర్ల దూరంలోని గడిగరేవుల పాఠశాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం

5. పాములపాడు మండలం కరివేన పాఠశాల ఉపాధ్యాయులకు 15 కిలోమీటర్ల దూరంలోని బస్సు సౌకర్యం లేని వెంకటాపురం జడ్పీ పాఠశాలను ఏర్పాటు చేయడం

సాంకేతిక సమస్యతోనూ ఇబ్బందులు..

జిల్లాలో దాదాపుగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న అన్ని క్లస్టర్ స్కూల్ సముదాయాల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్ర్కీన్స్ ప్రదర్శనతో ఐఎఫ్‌టీ ద్వారా నిర్వహించిన బోధనా నైపుణ్య తరగతులకు ఇంటర్నెట్ ఇబ్బందులకు గురి చేయడంతో ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు సార్లు ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయడం, యాప్ సాంకేతిక సమస్యతో సరిగ్గా పని చేయకపోవడం, ఐదు గంటలకు సమావేశం ముగిసినా రాత్రి ఏడు వరకు హాజరు తీసుకోకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

మండలంతో సంబంధం లేకుండా క్లస్టర్ ఏర్పాటు చేయాలి

ఏ మండలంలోని ఉపాధ్యాయులు ఆ మండలంలోనే క్లస్టర్ సమావేశాలు కాకుండా ఆ పాఠశాలకు దగ్గరలోని ఇతర మండలంలో ఉన్నా ఆ క్లస్టర్‌లోనే కలపాలి. పాఠశాలకు పూర్తి సెలవునిచ్చి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు క్లస్టర్ సమావేశాన్ని కొనసాగించాలి.

- రామఫక్కీరారెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం



మొదటి క్లస్టర్ సమావేశం నిర్వహించాం. సమాశానికి వెళ్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అక్కడక్కడా ఎదురైన సాంకేతిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఎక్కడా సమస్య లేకుండా చేస్తాం. అలాగే మధ్యాహ్నం సెలవు ప్రకటించడం వల్ల విద్యార్థులకు ఏ సమస్య తలెత్తకుండా, సెలవు ప్రకటించకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకరిద్దరు ఉపాధ్యాయులను అక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులతో మాట్లాడి వారికి ఇబ్బందులు లేకుండా చేస్తాం. రెండో సమావేశానికంతా అన్ని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల



క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సెలవు పెట్టకూడదనే నిబంధన దారుణం



క్లస్టర్ సమావేశం రోజున సెలవు పెట్టకూడదనే నిబంధన అత్యంత దారుణం. అనేక ఇబ్బందులు ఎదుర్కొని క్లస్టర్ సమావేశానికి చేరుకున్నా అక్కడ సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- మౌళాలి, పీఆర్‌టీయూ నాయకులు

అధికారులే బాధ్యత వహించాలి



హడావుడి సమయం వల్ల ఉపాధ్యాయులకు ఏదైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాలి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత 8 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో మారుమూల బస్సు సౌకర్యం లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాల క్లస్టర్ సమావేశాలకు ఏ విధంగా ఉపాధ్యాయులు ఒంటి గంటకు చేరుకోవాలో ఆలోచించాలి. ఇంటర్నెట్ సదుపాయం లేక హాజరు వేయడం ఆలస్యమవుతోంది.

- శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకులు

వేసవిలో శిక్షణా తరగతులు నిర్వహించాలి



ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు క్లస్టర్ శిక్షణా తరగతులు నిర్వహించాలి. రాబోయే సమావేశం ఇదేవిధంగా నిర్వహిస్తే పోరాటం చేయాల్సి వస్తుంది.

- శివయ్య, ఏపీటీఎఫ్ 257 నాయకులు

జయహో గురు రాఘవేంద్రా

- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- బంగారు కవచంతో సుందరీకరణ
- భక్తులతో మార్మోగిన మంత్రాలయం



బంగారు పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రులు

మంత్రాలయం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి గురువైభోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు కవచం, వెండి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి హారతులు ఇచ్చారు. అంతకు ముందు పూర్ణబోధ పూజా మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు సంస్థాన పూజ చేసి హారతులు ఇచ్చారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి స్వహస్తాలతో చేసిన పూజలను కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పాద పూజ చేసి చెక్క, వెండి, రజిత గజ వాహనం, బంగారు, నవరత్నాల రథాలపై అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం బంగారు పల్లకిలో స్వామివారిని బృందావన ప్రతిమను అధిష్ఠించి వైభవంగా ఊరేగించారు. రాఘవేంద్ర నమోఃనమః అంటూ అశేష భక్త జనవాహినితో మంత్రాలయం మార్మోగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాలక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఉత్సవాల్లో రెండో రోజు కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, టీటీడీ సభ్యులు నరేష్ కుమార్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, తహసీల్దార్ ఎస్.రవి, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వోలు భీమన్నగౌడు, ఆనంద్, పాల్గొన్నారు.



రాఘవరాయల బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆకట్టుకున్న సంగీత కచేరి

గురు భక్తి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరుకు చెందిన విధూశ్రీ అదిపి నారాయణచే వోకల్ సంగీతం, బెంగళూరుకు చెందిన కడప హనుమేషాచార్‌చే వేణు సంగీతం దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపి నరసింహమూర్తి, వాధిరాజాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, సుధీంద్రాచార్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవికులకర్ణి, జేపీస్వామి, వ్యాసారాజాచార్‌లు, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, వాఘేంద్రచార్, రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత విద్యకు అధిక ప్రాధాన్యం

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

దేశంలో సంస్కృత విద్యకు హిందూ ధర్మం, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేందుకు సంస్కృత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు న్యాయసుధ పరీక్షల్లో శిక్షణ పొందిన ఎనిమిది మందికి పరీక్షలు నిర్వహించారు. వారికి వివిధ వేద విద్వాంసులు, పండితులు, వేద పాఠశాల అధ్యాపకుల మధ్య పరీక్ష కొనసాగించారు. ఎనిమిది మందిలో రుషికేష్, పురాణిక్ భద్రినాథ్, అభిషేక్ జోషీలు ఉత్తీర్ణులయ్యారు. మరో ఐదుగురికి మరో రెండు రోజులు పరీక్షలు కొనసాగుతాయని పీఠాధిపతి తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి పరిమళ గ్రంథం పూర్తి చేసుకుని శ్రీమఠంలోనే శాశ్వత ఉద్యోగులుగా వారికి సకల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్వాన్‌పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజాఎస్ గిరిరాజాచార్, రాజా ఎస్ అప్రమేయాచార్, కృష్ణ కౌశిక్, వాదిరాజాచార్, బండి శ్యామాచార్, పురోహిత్ నరసింహాచార్, వేణుగోపాల్ ఆచార్, రమేష్‌ఆచార్ పాల్గొన్నారు.



న్యాయసుధ పరీక్షలు నిర్వహిస్తున్న పీఠాధిపతి, రాజాఎస్‌గిరిరాజాచార్‌లు

ప్రముఖులకు అవార్డులు



రైల్వే శాఖ మంత్రి సోమన్నకు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురు వైభవోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రైల్వే శాఖ మంత్రి సోమన్న, టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్‌లకు ఊంజల మండపంలో అవార్డులు ప్రదానం చేశారు. అదే విధంగా ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో బెంగళూరు సీబీఐ కోర్టు జడ్జి జస్టిస్ హెచ్‌ఏ మోహన్, సువర్ణ టీవీ చానల్ ఎడిటర్ అజిత్, హనుమక్కనవర్, బెంగళూరు జిల్లా జడ్జి విజయ్‌దేవరాజ్, రాష్ట్ర ఆడిట్ ఫైనాన్స్ రీజనల్ డైరెక్టర్ గోవిందప్పలు రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అవార్డులు స్వీకరించారు. వీరికి వేర్వేరు సమయాల్లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ ఎస్.రవి, డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యోగీంద్ర కళా మండపంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ప్రశంసాపత్రం, వెండితట్ట, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, ఆనందతీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, వాధిరాజాచార్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వందే భారత్ స్లీపర్ రైలును పట్టాలెక్కిస్తాం

బెంగళూరు నుంచి గుల్బర్గా వరకు వందేభారత్ స్లీపర్ రైలును త్వరలో పట్టాలు ఎక్కిస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సోమన్న అన్నారు. గురు వైభవోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. మంత్రాలయం మీదుగా వందేభారత్ రైలు సమయాలు అనుకూలంగా లేవని, భక్తుల నుంచి ఫిర్యాదులు, సలహాలు రావడంతో సమయ వేళలు మారుస్తామని తెలిపారు. ఈ అవార్డు రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త, డీసీఎం మనోజ్, కుమారస్వామి, డీవోఎం, డీఎస్పీ, స్టేషన్ మాస్టర్ వాస్మిక్, చంద్రరాజ్, జాఫర్‌ఖాన్, కాశినాథ్‌లు పాల్గొన్నారు.



బెంగళూరు సీబీఐ కోర్టు జడ్జి మోహన్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

జిల్లా స్థాయి జాతీయ సైన్స్‌డే వారోత్సవాలు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీ క్యాంపులోని ఐఏఎస్ఈ కాలేజీలో జిల్లా స్థాయి జాతీయ సైన్స్ దినోత్సవం ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ ఆదివారం తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సైన్స్, ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత (ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్) అంశంపై క్విజ్, సెమినార్ నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రాథమిక స్థాయి 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు, 9, 10 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. మీ పాఠశాలలో విద్యార్థుల పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రంగమ్మ 8790111331 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎక్సైజ్‌శాఖ అధికారుల సంఘం
ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



నియామక పత్రం అందుకుంటున్న రాజేంద్ర ప్రసాద్

కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి మచ్చా సుధీర్ బాబు, అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎక్సైజ్ డీన్ సీఐ సోమశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎక్సైజ్‌శాఖ కోసిగి సీఐ పి.భార్గవరెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎక్సైజ్ శాఖ ఎమ్మిగనూరు సీఐ ఎ.రమేష్‌రెడ్డి,, జాయింట్ సెక్రటరీగా కర్నూలు ఎక్సైజ్ ఎస్ఐ రెహనా, ట్రెజరర్‌గా కర్నూలు ఎక్సైజ్ ఎస్ఐ దుర్గా నవీన్‌బాబు, ఈసీ మెంబర్లుగా ఎక్సైజ్‌శాఖ ఎస్ఐలు ఓ.శ్రీధర్, ఆర్‌జరమాదేవీ, ఎ.శేషాచలం, ప్రవీణ్‌కుమార్ నాయక్, ఇంద్రకిరణ్ తేజను ఎన్నుకున్నారు.

నీటిని మళ్లించడం అన్యాయం: ఎంపీ బస్తిపాటి



కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ నుంచి కర్నూలుకు వస్తున్న నీటిని కర్ణాటకలోని ఎర్రగుడి రిజర్వాయర్‌కు మళ్లించడం అన్యాయమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. జలచౌర్యం పై టీబీ డ్యామ్ బోర్డు అధికారులలో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. అనుమతి లేకుండా కర్నూలుకు వచ్చే నీటిని పైపుల ద్వారా ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర చెబితే అక్కడి అధికారులు నీటిని పైపుల ద్వారా దోపిడీ చేయడం ఏమిటని మండి పడ్డారు. నీటిని మళ్లించడం ద్వారా తమకు వేసవిలో తాగునీటి సమస్య వస్తుందని, ఆ సమస్యను ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. నీటి చౌర్యాన్ని అరికట్టాల్సిన అధికారులను ఆదేశించారు. ప్రస్తుత నీటి మళ్లింపు నిలిపి వేశారని అదికారులు చెప్పారు. మరో సారి దిగువ రావాల్సిన నీటిని దోపిడీ చేయాలని భావిస్తే అక్కడి అధికారులు, నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి మళ్లింపుపై కర్నూలు జిల్లా వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కర్నూలు ఎస్ఏపీ క్యాంపు ఏపీ రెసిడెన్షియల్ కన్వీనర్, ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏపీఆర్ఎస్ సీఏటీ-2025 జూనియర్ కళాశాలలు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాల (బాలుర)లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు Https://aprs.appfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన ఏపీఆర్ఎస్ క్యాట్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏపీఆర్‌జేసీ అండ్ డీసీ సెట్-2025 అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నీలితొట్ల వీధిలో మరొకరి మృతి

పరిస్థితిని పర్యవేక్షించిన కలెక్టర్ రాజకుమారి



నీలితొట్ల వీధిలో పర్యటిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధికి పక్కనే ఉన్న గొల్లపేట కాలనీకి చెందిన రామచంద్రుడునాయక్ (60) శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే మృతులు కలుషిత నీటిని తాగడం వల్లే వాంతులు, విరేచనాలు ప్రబలి మరణించారని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం నిర్ధారించడం లేదు. ఇప్పటికే ఆత్మకూరు పట్టణానికి సరఫరా జరిగే వెలుగోడు రిజర్వాయర్ జలాలతో పాటు స్థానికంగా ఉన్న 35 బోర్‌వెల్స్, 19 మినరల్ వాటర్ ప్లాంట్స్ నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించినప్పటికీ ఎలాంటి లోపాలు లేవని అధికారులు చెబుతున్నారు. అక్రమంలో మైక్రో బ్యాక్టీరియాను గుర్తించేందుకు పలు నీటి నమూనాలను కర్నూలుకు పంపించగా ఆ రిపోర్టులు మంగళవారానికి వచ్చే అవకాశం ఉంది. అయితే మృతి చెందిన వారిలో అతిసార లక్షణాలేవి లేవని అధికారులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన బషిరూన్‌బీ (65) ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధిలో ఉంటున్న తన కొడుకు ఇంటి వచ్చి అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది. అప్పటికే కొన్ని నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. అలాగే నీలితొట్ల వీధికి చెందిన రహంతుల్లా (50) కూడా బలహీనంగా ఉండటంతో పాటు అధిక హైపర్ టెన్షన్‌కు లోనై మృతి చెందినట్లు రిపోర్టుల ఆధారంగా స్వయంగా కలెక్టరే ప్రకటించారు. శనివారం మరణించిన రామచంద్రుడునాయక్ కూడా కొంతకాలంగా పక్షపాతంతో బాధపడుతూ మృతి చెందారని, అతిసారతోనే మరణించినట్లు నిర్ధారణ కాలేదని వైద్యాధికారులు చెబుతున్నారు. అయితే ముగ్గురి మరణానికి అతిసార కారణం కాదని అధికారులు బలంగానే చెబుతున్నప్పటికీ వాస్తవ కారణాలను మాత్రం స్పష్టంగా వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్ల వీధి, గొల్లపేట కాలనీల్లో అతిసార ప్రబలి మరో వ్యక్తి మృతి చెందారన్న ప్రచారంతో ఆదివారం కలెక్టర్ రాజకుమారి హుటాహుటిన ఆత్మకూరుకు చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం కాలనీల్లో జరుగుతున్న ప్రభుత్వ సేవలపై వైద్య, మున్సిపల్, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా కాలనీలకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా నిలిపి వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరమేమి లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆమె స్థానిక సీహెచ్‌సీని సందర్శించి అక్కడ బాధితులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఈమె వెంట ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఓ జహురుల్లా, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైద్యాధికారులు ఉన్నారు.

కంది రైతు కన్నీరు

(5వ పేజీ తరువాయి)

మధ్యలో ఏమైందో తెలియదు గాని, కొనుగోళ్లను భారీగా తగ్గించారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 13వేల మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాలో 9వేల మెట్రిక్ టన్నులు కందులను మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు క్వింటం కందులకు రూ.6వేల నుంచి 7వేలలోపే ధరను అందించడమే కాకుండా తరుగు, తేమ తదితర కారణాలతో ఒక బ్యాగు కందుల మీద 4 కిలోలు తీసుకుంటున్నారు. వ్యాపారుల అక్రమాలను అరికట్టాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం లేదని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అంటున్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటి దాకా 2,600 మెట్రిక్ టన్నులను 1870 మంది రైతుల నుంచి కొన్నామని, వారికి రూ.7.70 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటికే 1.58 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,800 మెట్రిక్ టన్నుల కందులను 1,345 మంది రైతుల నుంచి కొన్నారు.

నాణ్యత లేదని వెనక్కి పంపుతున్న సీడబ్ల్యూసీ అధికారులు

ప్రస్తుతం కేడీసీఎంఎస్ కేంద్రాల రైతుల నుంచి కందుల కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ అధికారులు వేగవంతం చేశారు. ఈ కేంద్రాల్లో నాణ్యతను పరిశీలించిన తర్వాతనే లారీల్లో వాటిని కేంద్ర గిడ్డంగుల సంస్థకు పంపుతున్నారు. అయితే.. వివిధ కారణాలతో కందులను గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు కేంద్ర గిడ్డంగుల సంస్థ నానా రకాలుగా ఆటంకాలు సృష్టించడంతో కొనుగోలు కేంద్రాల సిబ్బందికి దిక్కుతోచడం లేదు. దీంతో కొన్న కందులను లారీల్లో మళ్లీ వెనక్కి తీసుకువచ్చి రైతులకు అప్పజెప్తున్నారు. ఈ పరిణమానికి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రవాణా ఖర్చులు, హమాలీల ఖర్చులు కలుపుకుంటే తమకు మార్క్‌ఫెడ్ అధికారులు చెల్లిస్తున్న మద్దతు ధర ఏ మాత్రం గిట్టుబాటు కాదని, మార్కెట్ యార్డుల్లో వ్యాపారులకు అమ్ముకోవడమే మేలని రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు వెళుతున్నారు. తమకు మామూళ్లు ఇవ్వడం లేదనే సాకుతో పాటు వివిధ కారణాల వల్ల కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు ఉద్దేశ పూర్వకంగానే కందులను గోదాముల్లోకి అనుమతించకుండా వెనక్కి పంపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు దాదాపు వందల మెట్రిక్ టన్నుల కందులు తీసుకొస్తున్నారు.

కేంద్ర గిడ్డంగుల సంస్థ రైతులకు న్యాయం చేయాలి

కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో కందులను నిల్వ చేసుకుండా తప్పించుకొనేందుకు రకరకాల కారణాలు చెబుతున్నది. డీసీఎంఎస్ కేంద్రాల వద్ద కందులు నాణ్యంగా ఉంటేనే మా సిబ్బంది రైతుల నుంచి కొంటున్నారు. అలాంటప్పుడు కేంద్ర గిడ్డంగుల సంస్థ అధికారులు కందులు నాణ్యంగా లేవని వెనక్కి పంపడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని నిబంధనలను కొంత మేరకు సడలించాలని విజ్ఞప్తి చేశాం. రైతులు ఇంటి వద్దనే కందులు శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అవగాహన కల్పిస్తున్నాం. కందులు కొన్న తర్వాత గంటల వ్యవధిలో రైతులకు డబ్బు చెల్లిస్తున్నాం.

- రాజు, జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్

ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కుమారీ చైతన్య స్వరూపిణి

అభినందించిన హోమ్ మంత్రి అనిత



ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన చైతన్య

కర్నూలు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు కూతురు కుమారి చైతన్య స్వరూపిణి ఫైరింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. 2024 బ్యాచ్‌లో 394 మందిలో సబ్ ఇన్‌స్పెక్టర్ (సీవిల్)శిక్షణ పూర్తిచేసుకుని ఫైరింగ్ విభాగంలో ప్రతిభ సాధించారని ఎక్సైజ శాఖ సీఐ చంద్రహాస్ తెలిపారు. హోంమంత్రి అనిత చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుని తండ్రి గౌరవాన్ని పెంచిన ఆమె కృషి అభినందనీయమని కొనియాడారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ ఆమె మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

బడ్జెట్‌తో రాష్ట్ర పునర్నిర్మాణానికి జీవం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి జీవం పోయనుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. గత వైసీపీ పాలకులు విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరిద్ధరించే దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జనరంజకమైన బడ్జెట్‌ను రూపొందించారని అన్నారు. రూ.48వేల కోట్లతో వ్యవసాయ రంగానికి బడ్జెట్‌ను కేటాయించి వ్యవసాయ, వాటి అనుబంధ శాఖల ప్రగతికి బాటలు వేయనున్నట్లు వివరించారు. అదే క్రమంలో అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6300కోట్ల నిధులను కేటాయించడం జరిగిందని తద్వారా రైతులకు మేలు జరగనుందని వెల్లడించారు.



ప్రమాదకరంగా ఉన్న భీమవరం బ్రిడ్జి



రక్షణ గోడలు లేని జంబులాపరమేశ్వరి గుడి రహదారి బ్రిడ్జి

వారధులు వణికిస్తున్నాయ్..

- మరమ్మతులకు నోచుకోని వంతెనలు
- భయం గుప్పిట్లో ప్రయాణికులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

నంద్యాల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వారధులు వణికిస్తున్నాయి. ఏళ్ల నాటి కట్టడాలు శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. నంద్యాల మండలం భీమవరం, పులిమద్ది గ్రామాల్లో కుందూనదిపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. అలాగే నంద్యాల పట్టణ సమీపాన జంబులా పరమేశ్వరి ఆలయానికి వెళ్లే దారిలోని బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉంది. నంద్యాల నుంచి భీమవరం మీదుగా కరిమద్దెల, వేల్పనూరు తదితర గ్రామాలకు కుందూనదిపై రోజు వందలాది వాహనాలపై ప్రయాణిస్తుంటారు. అలాగే జంబులాపరమేశ్వరిదేవి ఆలయానికి వెళ్లే వంతెన మీదుగా పులిమద్ది, సాయిబాబా గుడికి వాహనదారులు, రైతులు, కూలీలు వెళ్తుంటారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా బ్రిడ్జిలకు మరమ్మతులు, రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిలు ఇరుకుగా ఉండడంతో ట్రాక్టర్ గాని బస్సుగాని వస్తుంటే మరో వాహనం బ్రిడ్జి అవతల ఆగాల్సిందే. కూటమి ప్రభుత్వంలోనైనా బ్రిడ్జిలకు మరమ్మతులు చేపడుతారని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోగల రౌడీషీటర్లు, నేర చరిత్రగలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీస్ అధికారులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. రౌడీషీటర్లు, నేర చరిత్రగలవారు, చెడునడత కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తిపలకాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరాతీశారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనరాదని, మీ అందరిపై నిరంతరం నిఘా ఉంటుందని, పోలీసుల మాటలు వినకుండా చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నందికొట్కూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒకచోట చేరి ఆత్మీయ పలకరింపులతో అంతా సందడి చేశారు. పగిడ్యాల మండలం పి.ముచ్చుమర్రి ఉన్నత పాఠశాలలో 1999-2000 పదవతరగతి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గురువులను సన్మానించారు. గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువు వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నామంటూ విద్యార్థులు చెప్పుకొచ్చారు. గురువులతోనూ, తమ తోటి మిత్రులతో ఉన్న అనుభవాలను పంచుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి : ఎంపీపీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ

కొత్తపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తామని వెలుగోడు మండల పరిషత్ అధ్యక్షుడు లాలం రమేష్ అన్నారు. ఆదివారం మండలం గోకవరం గ్రామంలోని భక్తకన్నప్ప గురుకుల బాలుర ఆవస కేంద్రం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆవాస కమిటీ అధ్యక్షులు కోట్లప్రభాకర్‌రెడ్డి, క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, డా.శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి రఘురాములు హాజరయ్యారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ చెంచు విద్యార్థుల కోసం గత 25 ఏళ్ల క్రితం జి.పుల్లారెడ్డి భక్త కన్నప్ప గురుకులం స్థాపించి అంచెలంచెలుగా ఎదిగిందన్నారు. ప్రధాన వక్త ఎక్కా చంద్రశేఖర్ మాట్లాడుతూ చెంచు విద్యార్థుల కోసం, నిరాశ్రయులైన వారికి, బడుగు బలహీనవర్గాల వారికి సేవాభారతి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరహరి సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం అన్నదాన పథకానికి ఆదివారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బి. దశరథరామమ్ కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతలను అధికారులు సన్మానించారు.

కొత్తూరులో పూజలు



విజిలెన్స్ ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కర్నూలు ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి, గుంటూరు జిల్లా ఏఎస్పీ వర్ధారెడ్డి ఆదివారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఆలయ ఏఎస్ఐ రఫీక్, సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు నారాయణ స్వామి, సురేష్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా పాణికేశ్వర స్వామి ఉత్సవం

పాణ్యం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పాణ్యంలోని పాణికేశ్వర స్వామి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ సువర్ణ ఆధ్వర్యంలో భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పించారు.సాయంత్రం స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ పెరగడంతో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రముఖ విద్యావేత్త మృతి



రత్నస్వామి (ఫైల్)

వెలుగోడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ రాయసం రత్నస్వామి (90) ఆదివారం మృతి చెందారు. ఈయన వెలుగోడులో అనేక విద్యా సంస్థలకు సారథ్యం వహించారు. వెలుగోడులోని నీలం సంజీవ రెడ్డి డిగ్రీ కళాశాలకు వెలుగోడు జూనియర్ కళాశాలకు కరస్పాండెట్‌గా సేవలు అందించారు. అలాగే ఐటీఐ స్థాపనలో ఆయన ఎంతో కృషి చేశారు. సామాజిక సేవలో భాగంగా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సేవలు అందించారు. పలువురు మేధావులు అధ్యాపకులు పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు.

భూమి కోసం.. భుక్తి కోసం పోరాటం చేద్దాం

కొత్తపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఉంటూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని చెంచుల సమస్యలపై భూమి కోసం భుక్తి కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం పోరాటం చేద్దామని ఎంసీపీఐ (యు) జిల్లా కన్వీనర్ పాతకోట లాజరస్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలో భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు డివిజన్ వ్యవస్థాపక మహాసభ డివిజన్ కార్యదర్శి, సహాయ కార్యదర్శి ప్రాథకోట మర్రిస్వామి, లింగాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంసీపీఐ డివిజన్ ఆవిర్భావ సభ నిర్వహించారు.

మ్యాన్యువల్ విధానంలో టీచర్ల బదిలీలు చేపట్టాలి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఆన్‌లైన్ విధానంలో కాకుండా మ్యాన్యువల్‌గా నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాల ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన ఆదివారం యూనియన్ ముఖ్య సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బదిలీల చట్టంలోని పనితీరు పాయింట్లను తొలగించి సర్వీసు, స్టేషన్ పాయింట్లను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. బదిలీలు, పదోన్నతులలో ఖాళీగా ఉన్న స్థానాలను బ్లాక్ చేయకుండా అన్నింటినీ చూపించాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జాకీర్‌హుశ్శేన్, వీరేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డిలతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలనిఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 4వ తేదీన నియోజకవర్గాల స్థాయిలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్న ఆయన తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారం రాగానే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తానని చెప్పి ఇప్పటికి 9 మాసాలు అవుతున్నప్పటికీ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం చాలా బాధాకరమన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో లోకకళ్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులను జేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

'ఆ నలుగురు' సంస్థ సేవా స్ఫూర్తిదాయకం



వన్నూరు బాషాను సన్మానిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె/బేతంచెర్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : 'ఆ నలుగురు సేవా' సంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూర్‌బాషను బనగానపల్లె పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన సత్కరించారు. ఆయన సేవలను గుర్తించి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ వన్నూరు బాషా చేస్తున్న సేవలు ఆదర్శంగా తీసుకుని పలువురు స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. వన్నూరు బాషా వృత్తిరీత్యా వెల్డింగ్ పని చేసుకుంటూ ఆర్థికంగా లేకపోయినా ఎంత బరువైనా బాధ్యతను తనమీద వేసుకున్నాడన్నారు. అనాథ మృతదేహాలకు సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించండి



వ్యాపారులతో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. ఆదివారం పట్టణంలో ప్రధాన వీధుల్లో పర్యటించి పలువురు వ్యాపారులను కలిసి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నా బనగానపల్లె -నా బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, గ్లాసులు, వాడకంపై నిషేధం విధించామన్నారు. మటన్, చికెన్ దుకాణదారులు కస్టమర్లకు ప్లాస్టిక్ కవర్లలో మటన్, చికెన్ ఇవ్వరాదని సూచించారు. బనగానపల్లె పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న సుజాతమ్మ

బేతంచెర్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉప కమిషనర్ ఈవో రామాంజనేయులు



కోట్ల సుజాతమ్మకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న వేద పండితులు

ఆలయ మర్యాదలతో ఆమెకు పూర్ణకుంభంతో వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు కోట్ల సుజాతమ్మకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సన్మానించారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ

బేతంచెర్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బేతంచెర్ల క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులను టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, షేక్షావలి చౌదరి, నారాయణ స్వామి, విజయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

శిరివెళ్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహదేవపురం గ్రామంలో పాడి యజమాని షేక్ మహబూబ్ సాహెబ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. మహదేవపురంలో సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించి పాడి యజమానితో ఆదివారం మాట్లాడారు. బాధితుడికి పశుసంవర్ధకశాఖ ద్వారా నష్ట పరిహారం చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వం జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాలి, కాశీరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 2(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఆళ్లగడ్డలో ఇసుక కొరత లేదని, భవన నిర్మాణ కార్మికులు సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో రాచంశెట్టి వెంకట సుబ్బయ్య, దేవా, ఆంజనేయులు, శీను, కేశవ, శంకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలి

- అహోబిల మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలని అహోబిల మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సూచించారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా మెగా యూత్ ఫెస్టివల్ పరివర్తన అహోబిలం-2025 కార్యక్రమానికి 46వ పీఠాధిపతి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దాదాపు వెయ్యి మంది హరే కృష్ణ సభ్యులకు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు జరుగుతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి వైభవాన్ని దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఇస్కాన్ భక్తులకు వివరించారు.



ప్రసంగిస్తున్న అహోబిల మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

• వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ

డోన్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని వలసల గ్రామంలో చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు ఉన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వలసల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనమన్నారు. డోన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారనీ ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో వలసల గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు వలసల బాలుడు, క్లస్టర్ ఇన్‌చార్జి సుధాకర్, బూత్ కమిటి ఇన్‌చార్జి బాల తిమ్మయ్య, హరిజన లక్ష్మన్న, ఘన మద్దయ్య, మహదేవుడు, చిన్నలచ్చి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

గ్రామ దేవతలకు పూజలు

కొలిమిగుండ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గొర్విమానుపల్లె పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అబ్దులాపురం, మధనంతపురం పెద్దమ్మ ఆలయాల్లో, కనకాద్రి పల్లె చౌడమ్మతల్లి ఆలయంలో భక్తులు కుంకుమార్చనలు, అర్చనలు, పూజలు చేశారు.

10 నుంచి అభిషేకాలు

డోన్ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో ఈ నెల 10, 11 తేదీల్లో 21 అంశాలతో అభిషేక పూజలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

17 గొర్రెలు మృతి

ప్యాపిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుల గ్రామంలో ఆదివారం రాత్రి విషపు మొక్కలు తిని 17 గొర్రెలు మృతి చెందాయి. ఉదయం గొర్రెల మందను వెంకటేశ్వర్లు సమీపంలోని కొండకు తీసుకెళ్లాడు. అక్కడ విషపు మొక్కలు తిన్న 150 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. అందులో 17 గొర్రెలు కోలుకోలేక మృతి చెందినట్లు పశువైద్యాధికారి హుసేన్ తెలిపారు. గొర్రెల విలువ రూ. రెండు లక్షల ఉంటుందన్నారు.

పెద్దబోధనం ఎస్సీ కాలనీలో చోరీ

● మూడు తులాల బంగారు నగలు, రూ.20 వేల నగదు అపహరణ

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మండలంలోని పెద్దబోధనం ఎస్సీ కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యేసురత్నం కుటుంబ సభ్యులతో జమ్మలమడుగులోని కూతూరు ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగల గొట్టి తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనకు గురయ్యాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి అందులో దాచి ఉంచిన మూడు తులాల బంగారు నగలు, రూ.20 వేలు నగదు చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం గురించి తెలుసుకున్న జిల్లా క్లూస్‌టీమ్ అధికారులు పెద్దబోధనం గ్రామంలోని యేసురత్నం ఇంటి వద్దకు వెళ్లి పలు ఆధారాలు సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య సంఘటనా స్థలానికి వెళ్లి చోరీ సంఘటనపై విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసు నమోదు

బనగానపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు ఆటో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నందివర్గం గ్రామంలో బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మోహన్, ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాకలి పరశురాముడు పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకొని అతివేగంగా నిర్లక్ష్యంగా ఆటోలు నడుపుతుండడంతో గుర్తించారు. దాంతో వారిని పట్టుకొని కేసు నమోదు చేసి రెండు ఆటోలను సీజ్ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ఆటోలు నడిపినా, మద్యం తాగి ఆటోలు నడిపినా డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల రహదారిలో నివాసం ఉంటున్న సచివాలయ ఉద్యోగి మౌలాలి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శనివారం రాత్రి గ్రామంలోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న పెద్దవంగలి గ్రామానికి చెందిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వస్తున్న మౌలాలి గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మటన్ కోసం ఎగబడిన జనం

- తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 వరకు తగ్గని రద్దీ
- రికార్డు స్థాయిలో వ్యాపారం
- వెలవెలబోయిన చికెన్ దుకాణాలు

కొలిమిగుండ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మటన్ దుకాణాలకు మాంసం ప్రియులు ఎగబడ్డారు. ఓవైపు మాఘ మాసం ముగిసిన తరువాత మొదటి ఆదివారం కావడం, మరోవైపు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియడంతో మటన్ కోసం పెద్ద ఎత్తున ప్రజలు దుకాణాల వద్దకు తరలివచ్చారు. మండలకేంద్రం కొలిమిగుండ్లలో



వెలవెలబోతున్న చికెన్ దుకాణం



మటన్ దుకాణాల వద్ద గుమిగూడిన జనం

ఆదివారం తెల్లవారుజాము నుంచే మాంసం కోసం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మటన్ దుకాణాల వద్దకు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతం అంతా కిక్కిరిసిన జనంతో చిన్నపాటి తిరునాలను తలపించింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక్క రోజులోనే గతంలో ఎప్పుడూలేని విధంగా రికార్డు స్థాయిలో 2000 కిలోలకు పైగా మాంసం విక్రయాలు జరిగినట్లు సమాచారం. ఇంకోవైపు అవుకు నుంచి కొలిమిగుండ్ల మాంసం మార్కెట్‌కు వచ్చిన చేపలు గంటల వ్యవధిలోనే మాయామయ్యాయి. ఇదిలా ఉంటే చికెన్ విక్రయాలు మాత్రం పూర్తిగా పడిపోయాయి. బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ వైపు కన్నెత్తి చేడలేదు. దీంతో వినియోగదారులు లేక చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.

పూల అంగళ్లు దగ్ధం



చాగలమర్రిలో దగ్ధమవుతున్న పూల అంగళ్లు

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండులో నిప్పంటుకొని ఐదు పూల అంగళ్లు దగ్ధమయ్యాయి. గ్రామంలో కొన్నేళ్లగా పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున పూల అంగళ్లు దగ్ధమై భారీగా మంటలు వ్యాపించాయి. గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. చాంద్‌బాష, షరీఫ్, ఇమామ్‌హుసేన్, షాషావలి, ఉసేన్‌వలిలకు చెందిన పూల దుకాణాలు దగ్ధమై రూ. లక్ష దాక నష్టం వాటిల్లింది. అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా అన్న విషయం తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ నబీసాహేబ్, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ అందరి బాధ్యతని ఎఫ్‌వో రామకృష్ణ అన్నారు. ఆదివారం డి.వనిపెంట సక్షన్ పరిధిలోని బాచేపల్లె తండా గ్రామంలో డీఎఫ్‌వో, రేంజర్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా మంజుభార్గవి కళాజాత బృందంతో జానపద గేయాల ద్వారా అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. చెట్లు నరకవద్దని, నిప్పు పెట్టరాదని సూచించారు. కళాకారుల జానపద గేయాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అటవీ సిబ్బంది సుభాష్, మదన్‌గోపాల్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

సీతారాములకు విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో మాఘమాసం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం సీతారాములకు విశేష పూజలు చేశారు. మహిళలు సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణం, లలిత పారాయణం చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులతో పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వరకు ఆయా గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు. దూడల్లో వచ్చే బ్రూసెల్లస్ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పశుగ్రాస క్షేత్రాలు, గోకులాలు, పశుబీమా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి పెద్దమ్మ దేవర ప్రారంభం

డోన్ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో ఈ నెల 4, 5 తేదీల్లో పెద్దమ్మ దేవరను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, నైవేద్యాలు, బోనాలు సమర్పణ, గ్రామోత్సవం, 5న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

సరోజినీ నాయుడుకు ఘన నివాళి

డోన్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజినీ నాయుడు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

బనగానపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలోని పశువైద్యశాలలో నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గ సంఘం అధ్యక్షుడిగా అమీర్‌అలీ(పశుసంవర్ధకశాఖ), ఉపాధ్యక్షులుగా అబ్దుల్‌హక్(తహసీల్దారు కార్యాలయం), ప్రసాద్(ఆర్‌అండ్‌బీ), కార్యదర్శిగా మురళీకృష్ణుడు, సంయుక్త కార్యదర్శులుగా కెఎండీ షకీల్, హేమలత, కోశాధికారిగా ఇబ్రహీం, ఈసీ సభ్యుడుగా మగ్బుల్‌హుసేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైభవంగా గ్రామోత్సవం

డోన్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని రామచంద్ర మాలిక్‌బాబా దేవస్థాన్ సంస్థానంలో స్వామివారి ఆరాధనోత్సవాలు ముగిశాయి. ఆదివారం చివరి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

బనగాపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలోని గాలిగోపురంపై విద్యుత్ తీగలు తొలగిస్తుండగా నాగేంద్ర (27) అనే కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి ఆదివారం మృతి చెందాడు. ఆళ్లగడ్డ మండలం చిన్నబోధనం గ్రామానికి చెందిన నాగేంద్ర బనగాపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో విద్యుత్ తీగలు తీసేందుకు వచ్చారు. అయితే తీగలు తొలగిస్తుండగా ప్రమాద వశాత్తు కిందపడ్డాడు. వెంటనే సిబ్బంది చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని గ్రామీణ రోడ్లు

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఎప్పుడో వేసిన రోడ్లు కనీసం మరమ్మతులకు నోచుకో లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలతో రోడ్ల మరమ్మతుల గుగించి పట్టించుకోలేదు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గొడిగనూరు నుంచి కొత్తపల్లె, డి.వనిపెంట గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిం ది. ఈ రహదారి వెంట



గుంతలమయమైన కొత్తపల్లె రహదారి

వాహనాల రాకపో కలు అధికంగా ఉంటాయి. కంకర రాళ్లు తేలడంతో రాకపోకలకు ప్రజలు నరక యాతన పడుతున్నారు. గొట్లూరు నుంచి నేలంపాడు, కలుగొట్లపల్లె వెళ్లే రహదా రులు అధ్వానంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గుంతల రహదా రితో ఇక్కట్లు పడుతున్నారు. చింతల చెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామా లకు వెళ్లే తారు రోడ్డు దెబ్బతినింది. ఈ రహదారి వెంట మరమ్మతులు చేయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దాతల దయతోనే దాహం తీరేది



దాత బోరు వద్ద నీళ్ల కోసం వేచి ఉన్న గ్రామస్థులు

కొలిమిగుండ్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మీర్జాపురం గ్రామంలో తీవ్ర తాగు నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు నీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. కొద్ది రోజులుగా పాత ఊరులో పైప్‌లైన్‌ల ద్వారా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తోపుడు బండ్లపై ఊర బావులు, దాతల బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొనే దయనీయ దుస్థితి ఏర్పడింది. ఇంటింటికీ కొళాయి కనెక్షన్ అందించే జలజీవన్ మిషన్ కింద గ్రామాన్ని ఎంపిక చేసి, నిధులు ఖర్చు చేసినా కొళాయిలకు నీరు రాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రజలు తాగు నీటి కష్టాలను ఎదుర్కొంటుంటే అటు అధికారులు గానీ, ఇటు ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. పూర్తిగా వేసవి రాక ముందే ఈపరిస్థితి రావడంతో వేసవి కాలంలో మరెన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంట రక్షణకు వినూత్న ఆలోచన



చెట్టుకు అమర్చిన మైక్

చాగలమర్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గోపాయపల్లె రహదారిలోగల అడ్డవాగు సమీపంలో నిత్యం అడవి పందులు, జింకలు పంటలను నాశనం చేస్తున్నాయి. వీటి నుంచి పంటలను కాపాడుకునేందుకు అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో చాగమర్రి రైతు ఉసేన్‌బాషా వినూత్న ప్రయత్నం చేశాడు. పొలం పక్కన గల చెట్ల కొమ్మలకు, గెట్లకు కర్రలు పాతి మెగాఫోన్ ఏర్పాటు చేశాడు. దాని నుంచి వచ్చే వివిధ రకాల శబ్దాలు ద్వారా అడవి పందులు బెదిరి అటుగా రావడం లేదు. ఈ ఆలోచన విధానం బాగుండటంతో మరి కొందరు రైతు ఈ విధానాన్ని పాటిస్తూ పంట పొలాలను కాపాడుకుంటున్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ హాలు స్థలం

ప్యాపిలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాంపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలం అలంకార ప్రాయంగా మారింది. ఈ స్థలాన్ని దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించింది. అయితే ఇంతవరకు అక్కడ ఏ ప్రభుత్వాలు కూడా భవనం నిర్మించలేదని ఆ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీంతో కాలనీలో ఎటు వంటి సమావేశాలు నిర్వహించుకోవాలన్నా, ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్న ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పాలకులు స్పందించి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న స్థలం